క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం

జంగారెడ్డిగూడెం రూరల్: వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి అన్నారు. మండలంలోని పట్టిన్నపాలెంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ రత్నకుమారి ప్రారంభించారు.వైఎస్సార్‌సీపీ నాయకులు పసుపులేటి నాగార్జునరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో హౌసింగ్ డే

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని శ్రీనివాసపురంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి గృహాలను నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్, హౌసింగ్ డీఈ బి. రంగారావు, ఎంపీటీసీ జుజ్జువరపు తాతారావు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ

వేలేరుపాడు: అర్హులైన నిర్వాసితులందరికీ పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందిస్తామని వేలేరుపాడు తహసీల్దార్ కె చల్లన్నదొర పేర్కొన్నారు. శనివారం వేలేరుపాడు మండలంలో అత్యంత మారుమూలనున్న టేకుపల్లిలో ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ మంజూరుకాని అర్హులైన నిర్వాసితులుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామంలో ఉన్న మొత్తం 93 మంది అర్హుల పేర్లు వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కాలనీల వివరాలు గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వల్లా లక్ష్మీదేవి, వీఆర్వో వెంకటేష్, సచివాలయం సెక్రటరీ పవన్, ఇంజనీరింగ్ అస్టెంట్ ప్రసాద్,వీఆర్‌ఏ రాజు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణ

కొయ్యలగూడెం: మట్టి స్వభావం ఆధారంగా రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో పంటలు పండించుకునేందుకు భూసార పరీక్షలు దోహదపడతాయని మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు పేర్కొన్నారు. శనివారం భూసార పరీక్షల నిమిత్తం కొయ్యలగూడెం పరిసర ప్రాంతాలలో మట్టి నమూనాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈవిధానంపై మండల స్థాయిలో ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కొయ్యలగూడెం హబ్ మేనేజర్ సోమశేఖర్, మండలంలోని రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

పీటర్ కుమార్‌కు అవార్డు

బుట్టాయగూడెం: స్థానిక షాలెం ఇవాంజలికల్ చర్చి మినిస్ట్రీస్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ పీటర్ కుమార్‌కు మరో అరుదైన అవార్డు లభించింది. ఇటీవల మదర్ థెరిస్సా అవార్డును అందుకున్న పీటర్ కుమార్ భారతరత్న బీఆర్ అంబేడ్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డును అందుకున్నట్లు ఆయన శనివారం తెలిపారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఫిలాంత్రోపిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ డాక్టర్ అద్దంకి రాజా ఆధ్వర్యంలో ఈ అవార్డు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. తనకు వచ్చిన అంబేడ్కర్ అవార్డును విజయవాడలోని ఐలాపురం కన్వెన్షన్‌లో రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు చేతులమీదుగా అవార్డును, సన్మాన పత్రాన్ని అందుకున్నామని చెప్పారు. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి సోషల్ సర్వీస్ సెంటర్ అద్దంకి రాజా ఈ అవార్డును తనకు అందించే విధంగా కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణుతోపాటు ప్రముఖులు పాల్గొన్నట్లు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డును అందుకున్న పీటర్ కుమార్‌ను పలువురు అభినందించారు.

కల్వర్టు నిర్మాణం వేగవంతం

లింగపాలెం: లింగపాలెం నుంచి కొత్తపల్లి వెళ్లే రహదారిలోని పేరంటాలు చెరువు అలుగు చానల్‌పై రూ.33 లక్షలతో శ్లాబ్ కల్వర్టు నిర్మాణం పనులను వేగవంతం చేస్తున్నట్లు ఇరిగేషన్ డీఈ అర్జున్‌రావు తెలిపారు. డీఈ కల్వర్టు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ కల్వర్టు నిర్మాణం పనులకు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ నిధులు కేటాయించినట్టు ఆయన తెలిపారు. వర్షాకాలంలో ఈ అలుగు చానల్‌పై వరద ప్రవహిస్తుండటంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డీఈ తెలిపారు. కల్వర్టు నిర్మాణంతో ప్రజలు ఇబ్బందులు తొలుగుతాయన్నారు. లింగపాలెం నుంచి కొత్తపల్లి వెళ్లే మార్గానికి సంబంధించి రాకపోకలను వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రస్తుతం ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో వేరే మార్గానికి మళ్లించినట్లు ఆయన చెప్పారు.

అగ్నిమాపక వారోత్సవాలు

జంగారెడ్డిగూడెం: అజాగ్రత్త, సమయస్ఫూర్తి లేకపోవడం వల్లే అగ్నిప్రమాదాల సమయంలో భారీ నష్టం జరుగుతోందని జంగారెడ్డిగూడెం ఫైర్ అధికారి జి.అబ్రహ్మం అన్నారు. జంగారెడ్డిగూడెంలో అగ్నిమాపక వారోత్సవాలు రెండో రోజు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక యంత్రాలను వినియోగించే తీరును ప్రదర్శించారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేసి అగ్నిప్రమాద నివారణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రతి కుటుంబంలో ఆనందం



తిమ్మక్కపాలెంలో బ్రోచర్ అందించి పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా



కొయ్యలగూడెంలో వృద్ధురాలికి అందుతున్న పథకాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలరాజు

లింగపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలోనే రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. లింగపాలెం మండలం తిమ్మక్కపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ఎమ్మెల్యే ఎలీజా, మండల వైఎస్సార్ సీపీ నేత ముసునూరి వెంకటేశ్వరరావుతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఏమైనా సమస్యలు ఉన్నాయా, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఇంకా ఎవరైనా అర్హులు ఉన్నారా అని నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గత ప్రభుత్వం పెత్తందారుల కోసం పనిచేస్తే సీఎం జగనన్న పేదవాళ్ల కోసం నిరంతరం ఆరాట పడుతున్నారని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం నవరత్నాలతో నవశకానికి నాంది పలికి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వం అందజేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వైఎస్ జగన్ మోహనరెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ మండలపు సాయిబాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ కుప్పాల రామకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు కర్లపూడి ఆనంద్, యలమంచిలి సత్తిబాబు, బిప్రభాకరెడ్డి, రెడ్డి బాబ్జి, అధికారులు పాల్గొన్నారు.

గడపగడపకి పెరుగుతున్న ప్రజాదరణ

కొయ్యలగూడెం: ప్రభుత్వ నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి ప్రజాదరణ పెరుగుతోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కొయ్యలగూడెంలో శనివారం 2, 15, 16 వార్డుల్లో ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్, తహసీల్దార్ పాసం నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొదటి విడతలో గుర్తించిన సమస్యలు రెండో విడతలో వచ్చేసరికి పరిష్కారం అవుతున్నాయని దీంతో ప్రజలకు గడపగడపకు కార్యక్రమంపై విశ్వాసం, నమ్మకం ఏర్పడ్డాయని అన్నారు. ప్రజాప్రతినిధులందరూ నిత్యం ప్రజల మధ్య ఉండాలి, ప్రజల మధ్య గడపాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారని అన్నారు. తమ ప్రాంతంలో గతంలో పర్యటించిన సందర్భంలో విన్నవించిన రోడ్ల సమస్యలను మలి విడత గడపగడపకు కార్యక్రమంలో పరిష్కరించడంపై బాలరాజుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. మరింత మెరుగైన సంపూర్ణ ఆరోగ్యంతో బాలరాజు కార్యక్రమాలలో పాల్గొనాలంటూ వివిధ ప్రాంతాల్లో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, ఫిషరీ కార్పొరేషన్ డైరెక్టర్ తాతపూడి గుబ్బాలు, కొల్లూరు యశ్వంత్, పూలపల్లి రవి, నిక్కర్ నాగేశ్వరావు, సొంగ రాకేష్, బోనగిరి ఆశీర్వాదం పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే పథకాల లక్ష్యం



కొయ్యలగూడెంలో స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



బందంచర్లలో గృహానికి స్టిక్కర్ అతికిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొయ్యలగూడెం: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే బాలరాజు అన్నారు. శనివారం బ్రహ్మల కాలనీలో వైఎస్సార్ సీపీ మండల పట్టణ కన్వీనర్లు గొడ్డటి నాగేశ్వరరావు, సంకు కొండల ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలరాజు పాల్గొన్నారు. జగన్‌పైనే మా నమ్మకమని, జగనన్నే మా భవిష్యత్తు అని బ్రహ్మల కాలనీ ప్రజలు ముక్తకంఠంతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలరాజు ఇంటికీ వెళ్లి ప్రజలకు పథకాల అమలు తీరుపై ప్రశ్నలు అడిగి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. లబ్ధిదారులందరూ సంతృప్తి వ్యక్తం చేయడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బాలరాజు వద్ద మహిళలంతా జగనన్నే మా జీవితం అయ్యారని సంతోషం వ్యక్తం చేశారు. జగనన్న కల్పిస్తున్న వరాల వంటి సంక్షేమ పథకాల వల్ల పిల్లల్ని చదివించుకోవడంతోపాటు సొంత గృహాలను నిర్మించుకోగలిగామని వారు ఆనందం వ్యక్తం చేసి బాలరాజుకు మంగళ హారతులు పట్టారు. స్టేట్ ఫుడ్ కమిషన్ నంబర్ గంజిమాల దేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, సర్పంచులు పసుపులేటి రాంబాబు, ఏలేటి చిన్న తుక్కయ్య, లింగిశెట్టి అనంతలక్ష్మి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, చిటికెన నాగార్జున, మారిశెట్టి శ్రీను, ఎస్ఎస్ గణేష్, మడుతూరి శ్రీను, నిడదవోలు రాజ్యలక్ష్మి, చిటికెన లక్ష్మి, కొనకళ్ళ రాము, తొంటా వాసు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న అజెండా

వేలేరుపాడు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైసీపీ నేతలు పేర్కొన్నారు. వేలేరుపాడు మండల పరిధిలోని రుద్రమకోట గ్రామంలో శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వివిధ పథకాల ద్వారా ముఖ్యమంత్రి నిరుపేదలను ఆదుకుంటున్నారన్నారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పథకాలను ప్రజలకు నేతలు వివరించారు. ఇళ్లకు గృహయజమానుల అనుమతితో స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, కామినేని వెంకటేశ్వరావు, గుద్దేటి భాస్కర్, మెండెం కుమార్ పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు

టి.నరసాపురం: సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న జగన్ పాలన చరిత్రలో సువర్ణాధ్యాయం అని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి మధుసూధనరావు అన్నారు. మండలంలోని బందంచర్లలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సర్పంచ్ గుండే వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్‌లు రాయపాటి హరికిషోర్, బొట్ల విశ్వనాథం, రాచప్రోలు డేవిడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మా నమ్మకం నువ్వే జగన్

చింతలపూడి: చింతలపూడి మండలంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలు నమోదు చేస్తున్నారు. మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, వైసీపీ నాయకులు గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరిమే ఉత్సాహంతో ఇంటింటి సర్వే

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ఉరిమే ఉత్సాహంగా మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు కొనసాగిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరిస్తున్నారు. శనివారం బుట్టాయగూడెంలో సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, గాడి వెంకటరెడ్డి, త్రిమూర్తులు, భాస్కరరావు, లాలూ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దొరమామిడి, కోయ రాజమండ్రి, కేఆర్‌పురం, కోటనాగవరం, రెడ్డిగణపవరంలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

వైద్య విధానంలో సమూల మార్పు



కొయ్యలగూడెంలో పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు తదితరులు

కొయ్యలగూడెం: వైద్య విధానంలో సమూల మార్పులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలిచేలా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. శనివారం డీఎంఅండ్‌హెచ్‌వో డి.ఆశ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి జిల్లాకి ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటుతోపాటు విలేజ్ క్లీనిక్, ఇంటింటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూనే మరోవైపు వైద్య విద్యను సామాన్య యువతకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. రూ.1.49 కోట్లతో నాడు-నేడు నిధులతో పీహెచ్‌సీ భవనాన్ని అధునాతన సదుపాయాలతో నిర్మించడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మిలతో కలిసి హాస్పిటల్‌లోని వివిధ విభాగాల వార్డులను ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. హాస్పిటల్లో అత్యవసరమైన విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వైస్ ఎంపీపీ మట్టా వనజ లక్ష్మి కోరారు. అతిరాస కార్పొరేషన్ ఛైర్మన్ ఇళ్ల భాస్కరరావు, వైద్యాధికారులు విజయకృష్ణ, తస్లీమా, శ్రీనివాస్, రాజీవ్ కృష్ణ, సీహెచ్‌వో నాగమణి, ఇందిరాబాబీ, ఆర్‌అండ్‌బీ డీఈ హరికృష్ణ, ఏఈ సమీరా, ఎంపీటీసీలు చింత శ్రీదేవి, ఘంటసాల శీనమ్మ, గంటా శ్రీను, ఎస్‌కే బాజీ, తేలే శ్రీను పాల్గొన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఇందిరానగర్‌లో వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వైద్యశిబిరంలో నేత్ర పరీక్షలు చేయించుకున్న వారిలో కొంతమందికి కళ్లజోళ్లు సుశీలా ఆసుపత్రి అధినేత, డాక్టర్ కాకర్ల రామచంద్రబాబు రూ. 30వేల వితరణతో అందజేసినట్లు ఆయన తెలిపారు. రామచంద్రబాబు మాట్లాడుతూ ఇటీవల మృతిచెందిన సంఘ సేవకులు దుగ్గిరాల ప్రసాద్ జ్ఞాపకార్థ ఈ సేవాకార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు పాల్గొన్నారు.కౌన్సిలర్ కరుటూరి రమాదేవి, బీజేపీ నేత పీసుపాటి రామలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌బీకే కేంద్రాల్లో భూసార పరీక్షల నిర్వహణ

బుట్టాయగూడెం: రైతు భరోసా కేంద్రాల్లో మొదటిసారిగా భూసార పరీక్ష నిర్వహిస్తామని వ్యవసాయ శాఖ ఏడీఏ(కేఆర్‌పురం) పి. బుచ్చిబాబు తెలిపారు. బుట్టాయగూడెం సమీపంలో శనివారం భూసార పరీక్షలకు సంబంధించిన మట్టి నమూనా సేకరణపై మండల స్థాయి ఆర్‌బీకే సిబ్బంది, వీఏఏ, వీహెచ్ఏలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మట్టి నమూనా సేకరణపై క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించారు. మండల వ్యవసాయ అధికారి బి. సుమలత మట్టి నమూనాల సేకరణను వివరించారు. రసాయనిక ఎరువులు వేసే పొలాల్లో 45 రోజుల వరకూ నమూనాలు తియ్యకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం: రోటరీ బాలికా విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని రోటరీ అధ్యక్షుడు దాకారపు కృష్ణ అన్నారు. జంగారెడ్డిగూడెంలో శనివారం ఫార్మసీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థికి రూ. 25వేలు నగదును అందజేశారు. రాజమండ్రి గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో జంగారెడ్డిగూడెంకు చెందిన రొంగల సుచిత్ర ఫార్మసీ విద్యనభ్యసిస్తోందన్నారు. రెండో సంవత్సరం కళాశాల ఫీజు నిమిత్తం సుశీల ఆసుపత్రి అధిపతి, ప్రముఖ వైద్యులు కాకర్ల రామచంద్రబాబు, మాధవి దంపతులు రూ. 25వేలు అందజేశారని తెలిపారు. ఈ నగదును శనివారం విద్యార్థిని సుచిత్రకు అందజేసినట్టు కృష్ణ తెలిపారు.

శాశ్వత భూ హక్కు ప్రారంభం

పోలవరం రూరల్: ప్రతి రైతుకు తన సొంత భూమిలో హక్కు కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు కార్యక్రమం పోలవరం మండలంలో శనివారం విజయవంతంగా ప్రారంభమైంది. పోలవరం మండలం పట్టిసీమలో భూములను ఇటీవల అధికారులు సర్వే చేశారు. రైతులకు వివరాలను తెలియజేశారు. ఆ భూములకు సంబంధించి ప్రతి రైతుకు సరిహద్దులను నిర్ణయిస్తూ రాళ్లు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.పోలవరం తహసీల్దార్ బి.సుమతి, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, రైతుల భూముల్లో సరిహద్దు రాళ్ల కార్యక్రమాన్ని చేపట్టారు.

ఎన్‌ఆర్‌సీలు చిన్నారులకు వరం



ఏరియా ఆసుపత్రిలో చిన్నారులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో ఆశ

జంగారెడ్డిగూడెం: తక్కువ బరువు, ఎదుగుదల లేకపోవడం, రక్తహీనత ఉన్న చిన్నారులకు న్యూట్రిషన్ రీహెబిలిటేషన్ సెంటర్లు (ఎన్‌ఆర్‌సీ) ఒక వరమని, దానిని సద్వినియోగం చేసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో ఆశ అన్నారు. జంగారెడ్డిగూడెంలోని ఎన్‌ఆర్‌సీ సెంటర్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రీహెబిలిటేషన్ సెంటర్‌లోని చిన్నారులతో కొద్ది సేపు మాట్లాడారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఎన్‌ఆర్‌సీలు ఏలూరు, జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేశారని అన్నారు. సమస్యలున్న చిన్నారులను ఎన్‌ఆర్‌సీలో ఉంచి వారికి చికిత్స అందిస్తామన్నారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఎన్‌ఆర్‌సీలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని, వైద్యులు కూడా వారి సేవలను సమర్థవంతంగా అందిస్తున్నారన్నారు. జనవరి నుంచి మార్చి వరకు సుమారు 40 మంది వరకు చిన్నారులు ఈ ఎన్‌ఆర్‌సీలో చేరి ఆరోగ్యంగా ఇంటికి వెళ్లారన్నారు.

అవగాహన కల్పించడం అవసరం

ఎన్‌ఆర్‌సీల పట్ల ప్రజలకు అంతగా అవగాహన లేకపోవడంతో వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ బేబీ కమల అన్నారు. వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు ఎన్‌ఆర్‌సీల గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అవసరమైతే అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఎన్‌ఆర్‌సీలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రాజీవ్, ఎన్‌ఆర్‌సీ మెడికల్ అధికారిణి కె.సత్యశ్రీ, న్యూట్రిషియన్ సీహెచ్ గౌతమ్‌అపూర్వ పాల్గొన్నారు.

తిరుపతిలో ఇఫ్టూ ఆల్ ఇండియా మహాసభలు

జంగారెడ్డిగూడెం: తిరుపతిలో ఈనెల 16 17 18 తేదీల్లో నిర్వహించనున్న ఇఫ్టూ ఆల్ ఇండియా ఏడో మహాసభకు జంగారెడ్డిగూడెం డివిజన్ నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు శనివారం బయలుదేరారు. ప్రముఖ న్యాయవాది యు.ఏసుబాబు మహాసభకు బయలుదేరినవారికి అభినందనలు తెలియజేశారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డివిజన్ ప్రధాన కార్యదర్శి మంచిలి రాజు, షేక్ బాజీ, మీసాల యేసు, బోనంగి చిన్నబ్బాయి కారం రాఘవ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు దేశవ్యాప్త గుర్తింపు తీసుకురావాలి



గంజి మాల దేవిని అభినందిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, కార్యకర్తలు

కొయ్యలగూడెం: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు దేశవ్యాప్త గుర్తింపు తీసుకురావడానికి సమష్టి కృషి చేయాలి అని స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమాల దేవి పేర్కొన్నారు. స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యురాలిగా నియమితులైన నేపథ్యంలో దేవిని శనివారం కొయ్యలగూడెంలోని ఆమె నివాసంలో ఐసీడీఎస్ పీవో యుఎన్ స్వర్ణకుమారి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ముఖ్యమంత్రి జగన్ అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్యవంతమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యురాలిగా చిత్తశుద్ధితో సేవలందిస్తానని గంజిమాల పేర్కొన్నారు. సూపర్‌వైజర్లు నయోమి రాణి, వెంకాయమ్మ, బండారు సరస్వతి పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

జంగారెడ్డిగూడెం: జిల్లాలో మలేరియా నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జోనల్ మలేరియా అధికారిణి బి.సుబ్రహ్మణ్యేశ్వరి తెలిపారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో నమోదైన మలేరియా కేసులు, అందిస్తున్న చికిత్స, చేస్తున్న పరీక్షలు తదితర విషయాలను ఏరియా ఆసుపత్రి అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన ఆమె మాట్లాడుతూ మలేరియా నిర్మూలనకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఏలూరు జిల్లాలో మలేరియా ప్రభావిత గ్రామాలు సుమారు 100 ఉన్నాయన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రాజీవ్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ బేబీ కమల, బొర్రంపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆంజనేయులుపాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ రాజమండ్రికి చెందిన సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. గుండె, నరాలు, మెదడు, ఎముకలు, మూత్రనాళాల సమస్యలు, ఊపిరితిత్తులు, కడుపులో గ్యాస్ సంబంధిత సమస్యలు, చెవి, ముక్కు, గొంతు వంటి సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందిస్తారని చెప్పారు. ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. ఈ శిబిరాన్ని నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చింతలపూడి: ఏపీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 5 నుంచి 8వ తరగతి, ఇంటర్ ప్రథమ, డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం సురేష్‌బాబు శనివారం తెలిపారు. ఈ నెల 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. మే 20న అభ్యర్థులకు పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. 5 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9959666156 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవాలని కోరారు.

అగ్నిప్రమాదాల నివారణపై ప్రయాణికులకు అవగాహన

చింతలపూడి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణాలు చేసే సమయంలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపకాధికారి గంటా వెంకటేశ్వరరావు ఆర్టీసీ సిబ్బందికి, ప్రయాణికులకు వివరించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాలను అరికట్టడంపై ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పారిజాతగిరిలో వైభవంగా కల్యాణోత్సవం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం చైత్ర మాసశ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును వైభవంగా నిర్వహించారు. ఆరుగురు జంటలు ఉభయదారులుగా ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. శనివారం సందర్భంగా విశేషంగా భక్తులు ఈ కల్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. కార్యక్రమాలను కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు.

సారా పట్టివేత

వేలేరుపాడు: వేలేరుపాడు మండల పరిధిలోని నాగులగూడెంలో సోడే రాముడు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు లీటర్ల సారాను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సారా విక్రేతపై కేసు నమోదు చేసి, జంగారెడ్డిగూడెం కోర్టుకు తరలించినట్లు ఎస్సై శ్రీను తెలిపారు.